వైఎస్సార్ పింఛన్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

- కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీలో నేతలు
- సీఎం పెద్ద మనసును కొనియాడిన లబ్ధిదారులు

అల్లిపురం: వైఎస్సార్ పింఛన్ ద్వారా లక్షలాది మంది పేదల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలో వలంటీర్ల సహకారంతో పలువురికి ఆయన కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గడప దాటకుండానే పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. నెనెలవారీ పింఛను మొత్తాన్ని పెంచడంతో అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ జి.మధు, వలంటర్ శంకర్, సీవో ఇందీవర, ఆర్పీ కమల, టీచర్ సత్యవతి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కందుల బదరీనాథ్, కందుల కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తున్న కందుల నాగరాజు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వార్డు పరిధిలో 65 కొత్త పింఛన్లు మంజూరు చేసిన నేపథ్యంలో వార్డు పరిధిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పెద్ద మనసుతో కొత్త పింఛన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఇటీవల నియమితులైన వార్డు సచివాలయ కన్వీనర్లను సచివాలయ సిబ్బందికి పరిచయం చేశారు. కార్యక్రమంలో ఆకుల యేసు, రెయ్యి డేవిడ్‌రాజు, కాసరపు వాసు, వార్డు సచివాలయ కన్వీనర్లు రామరాజు, సారిక దైవకుమార్, డాక్టర్ రమణ, ఆనంద్, రామచంద్రరావు, నెల్లి వంశీ, నరేష్ మాస్టర్, నిమ్మకాయల ఆదిలక్ష్మి, రోజా, రమణి, ఆర్పీలు గురులక్ష్మి, వసుంధర, పార్వతి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 39వ వార్డులో మంజూరైన కొత్త పింఛన్లను ఆ వార్డు కార్పొరేటర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు మహ్మద్ సాధిక్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తదితరులు

సంక్షేమ కార్యదర్శి చిత్తశుద్ధి

మహారాణిపేట : జీవీఎంసీ వేపగుంట జోన్ పరిధి ప్రహ్లాదపురానికి చెందిన అనుపోజు లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు పింఛన్ ఇవ్వడానికి వార్డు సంక్షేమ కార్యదర్శి పట్నాల లావణ్య అనుపోజు లక్ష్మి ఇంటికి వెళ్లారు. అనారోగ్యం వల్ల కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి లక్ష్మికి పింఛన్ అందజేశారు. ఆమెకు పింఛన్ అందజేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని.. తాను దూరాభారంగా భావించలేదని లావణ్య వివరించారు.


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనుపోజు లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న లావణ్య

సంక్రాంతి స్పెషల్ బస్సుల నిర్వహణ తప్పనిసరి


సిబ్బందికి సూచనలిస్తున్న డీసీఎం అప్పలనాయుడు

అల్లిపురం : సంక్రాంతి స్పెషల్ బస్సులను సక్రమంగా మార్గ మధ్యంలో ఎటువంటి అవాంతరాలు రాకుండా మెకానికల్ సిబ్బంది నిర్వహించాలని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విశాఖపట్నం డిపోను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీని బట్టి వివిధ రూట్లలో బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. అధికారులు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనతో పాటు ఎంఎస్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే


విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనిసాసరావు పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి పేదరికం అడ్డు కాదని, ఎక్కువ విజయాలు సాధించిన వారిలో పేద కుటుంబాల నుంచి వచ్చిన వారేనని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే చదువుతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం, సమాజం పట్ల అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ కె. సుధ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, తగరపువలస డిగ్రీ కాలేజీ ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు, స్టూడెంట్ ప్రెసిడెంట్ కె. గ్రేస్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


బొట్టా ఎర్నికుమారికి బీమా మొత్తాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్ బీమాతో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. వార్డులో ఇటీవల బొట్టా ఆదిలక్ష్మి, లంకపల్లి శ్రీనివాసరావు మృతి చెందడంతో శుక్రవారం వారి కుటుంబ సభ్యులైన బొట్టా ఎర్నికుమారి, లంకపల్లి రాజేశ్వరిలకు బీమా మొత్తాన్ని అచ్చియ్యమ్మపేట సచివాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆ జీవోను రద్దు చేయాలి

దాబాగార్డెన్స్: రాజ్యాంగానికి, భావ స్వేచ్ఛకు వ్యతిరేకంగా జారీ అయిన జీవో నంబర్-1ని రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. యల్లమ్మతోటలో గల నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవింద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో వజ్జిపర్తి శ్రీనివాసరావు, గుత్తుల శ్రీనివాస్, తోట వాసుదేవరావు, బమ్మిడి గంగాధర్, ఎం. లక్ష్మి, హైదర్ ఆలీ షింకా, కస్తూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐకు అభినందనలు


సీఐకి అభినందనలు తెలియజేస్తున్న రంధి గోపి తదితరులు

అల్లిపురం: ఇటీవల టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన తిరుమలరావును 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పార్టీ నగర కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, ఆడారి వెంకటమహేష్, రంధి నాగపాపారావు మర్యాదపూర్వకంగా కలసి సత్కరించి అభినందనలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లిపురం : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం బూరాల సత్యనారాయణ (33) తన కుటుంబంతో కలసి 34వ వార్డు భూపేష్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఇతను టిఫిన్ షాపులో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం అతని భార్య పని మీద బయటికి వెళ్లింది. పిల్లలు స్కూలుకి వెల్లారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మృతుని కుమారుడు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని మృతుడు సత్యనారాయణ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సహకారంతో పోలీసులకు సమాచారం అందజేయటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతుని తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుపై అభ్యంతరాల స్వీకరణ

అల్లిపురం : పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదుకు సంబంధించిన వ్యక్తిగత క్లెయిములు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను నోటిఫికేషన్ వచ్చే 10 రోజుల ముందు వరకు స్వీకరించవచ్చునని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన కలక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు బీఎల్‌వోల ద్వారా పరిశీలించి నమోదు చేస్తారన్నారు.

వలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి


అచ్చియ్యమ్మపేటలో సమావేశమైన తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: వలంటీర్లు, పార్టీ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పిలుపునిచ్చారు. అచ్చియ్యమ్మపేట సచివాలయంలో శుక్రవారం ఆమె వలంటీర్లు, కన్వీనర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి వలంటీర్లతో కలసి కన్వీనర్లు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అచ్చియ్యమ్మపేట సచివాలయం కన్వీనర్లు సూరిబాబు, రిజ్వాన్, అనూష, కొబ్బరితోట-2 సచివాలయం కన్వీనర్లు దుర్గారావు, వెంకటేష్, తేజారత్నం, వార్డు నాయకులు లండా రమణ తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరమెట్టలో కన్వీనర్లు, వలంటీర్లతో రంధి గోపి తదితరులు

33వ వార్డులో..

వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయంలో శుక్రవారం వార్డు అధ్యక్షుడు రంధి గోపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కుమ్మరవీధి, వెంకటేశ్వరమెట్ట సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు, వలంటీర్ల పరిచయం చేపట్టారు. వలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం అడ్మిన్ భార్గవ్, చినిపిల్లి శ్రీనివాసరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, భీమరశెట్టి చంద్రకళ, ఆడారి మహేష్, వై.చిన్నమ్మలు, మాదబత్తుల రమేష్ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

పలువురికి ఎమ్మెల్యే ఆపన్నహస్తం

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించాలని.. సమస్యను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికే వారంలో మూడు రోజులు ప్రజాదర్బార్, గ్రీవెన్స్ నిర్వహిస్తున్నానని, అంతేగాక ప్రతి శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ పరిధి 36వ వార్డు ఆశిపాప వీధిలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొల్లి లక్ష్మీ ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఆ కుటుంబం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటపడడంతో వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేగాక ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం జిల్లా కలెక్టర్, ఎమ్మార్వోకు ఫోన్ ద్వారా వివరించారు. అలాగే వార్డు పరిధి గొడారి గోతుల్లో నివశిస్తున్న నిరుపేద ముస్లిం మహ్మద్ మున్ని పెరాలిసిస్‌తో బాధపడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.5 వేలు, అదే ప్రాంతంలో నివశిస్తున్న నిరుపేద ముస్లిం మహిళ ఆయిష సిద్దిక్ పెళ్లి ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. 37వ వార్డులో నిరుపేద మహిళకు పండగ ఖర్చుల కోసం రూ.వెయ్యి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, స్టేట్ డైరెక్టర్ కాకి పద్మ, రమణమ్మ, రమణి, బెహర వెంకటరత్నం, మీసాల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జిల్లా పరిషత్ మినిస్టీరియల్ నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ పరిషత్ యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం పంచాయితీరాజ్‌కు 16 యూనిట్లు ఉన్నాయి. అందులో జిల్లా పరిషత్ ఒక యూనిట్‌గా నడుస్తోంది. ఇప్పటి వరకు 13 యూనిట్లకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, త్వరలో జిల్లా కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని ప్రస్తుత అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తెలిపారు. పరిషత్ యూనిట్ అధ్యక్షుడిగా పీవీవీఎస్ మూర్తి(పరిపాలనాధికారి), కార్యదర్శిగా ఆర్‌వీ నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.రాజేశ్వరి, ఉపాధ్యక్షుడిగా రమణబాబు, జాయింట్ సెక్రటరీగా రాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.ఆనంద్, ఈసీ మెంబర్లుగా కె.వినోద్, వీవీవీ కృష్ణ, బీజేవీ ప్రసాద్, ఎల్.కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సీతారామరాజు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి అభినందించారు.

మలేరియా కమిటీ సమావేశం నేడు

దాబాగార్డెన్స్: నగరంలో దోమల నియంత్రణకు చేపట్టే చర్యల్లో భాగంగా గత కౌన్సిల్ సమావేశంలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఓ కమిటీ వేశారు. ఆ కమిటీ తొలి సమావేశం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నారు. దోమల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, తీసుకోనున్న చర్యలపై ప్రధానంగా చర్చించనున్నారు.

ప్రజాదర్బార్‌కు ఆదరణ

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ఏవీఎన్ కాలేజీ దగ్గర నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ప్రజా దర్బార్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వినతి పత్రాల ద్వారా ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ మేరకు స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి సూచనలు అందజేశారు. కార్యక్రమంలో 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీ జోన్స్, రాజు, స్టేట్ డైరెక్టర్ కాకి పద్మ, సీనియర్ నాయకులు రమణి, రమణమ్మ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ట్రస్టీలు బెహరా వెంకట రత్నం, మీసాల అశోక్‌కుమార్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, బాబ్జి, కడియం ప్రసాద్, పీసీ అప్పారావు, గౌతమ్, దేవి, సురేష్, సాగర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

ఆధ్యాత్మికం

ఘనంగా మన్యుసూక్త హోమం


ఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న వైదికులు

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి సిద్ధి కలుగుతుందని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి కోవిడ్ నిబంధనలను అనుసరించి ఈ హోమం నిర్వహించారు.

గాయత్రి హోమంతో ఉత్సవాలకు శ్రీకారం

దాబాగార్డెన్స్: పాత నగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో శుక్రవారం గాయత్రి హోమం నిర్వహణతో వివేకానంద ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ గాయత్రి హోమంలో పాల్గొని సంస్థ మహిళా సభ్యులను అభినందిస్తూ వారికి చీరలు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సంస్థ తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న సేవా కార్యక్రమాలు తెలుసుకున్నారు. తమ వంతు సాయం సంస్థకు ఎప్పుడూ ఉంటుందని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పేద ప్రజల కోసం 150 దుప్పట్లు అందిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.


సంస్థ మహిళా సభ్యులకు చీరలు అందజేస్తున్న శ్రీవత్సవ్

సత్యదేవునికి పౌర్ణమి పూజలు


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుక కొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి మంచు తాకిడి తగిలింది. శుక్రవారం పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక జిల్లా నలుమూలలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే స్వామి దర్శనానికి భక్తులు ఆలయానికి చేరారు. అయితే మంచు తీవ్రత అధికంగా ఉండడంతో ఆశించినంత సంఖ్యలో భక్తులు రాలేదు. ధ్వజ స్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం..

నగరానికి చెందిన యేలూరి గోపీనాథరావు కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో శిరీషకు అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు.


నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న యేలూరి గోపీనాథరావు

రేపు ఉచిత మెగా మెడికల్ క్యాంపు

దాబాగార్డెన్స్: మాజీ పోలీస్ అధికారి సయ్యద్ మీర్ మహ్మద్ జ్ఞాపకార్థం ఈ నెల 8న బీచ్‌రోడ్డు, పెదజాలారిపేట నేవల్ క్యాంటీన్ ఎదురుగా ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్టు కొత్తకోట సీఐ, సయ్యద్ మీర్ మహ్మద్ తనయుడు సయ్యద్ ఇలియాస్ మహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతనగరంలో నిరుపేద కుటుంబాలు కాలుష్యం, ఇతర కారణాల వల్ల అనారోగ్యం పాలవుతున్న దృష్ట్యా ప్రత్యేకంగా వారి కోసం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎముకల వైద్యులు, గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, ఫిజియోథెరపీతో పాటు ఉచితంగా రక్త పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 8897967494, 9032991339 నంబర్లలో సంప్రదించవచ్చు.

యూజర్ చార్జీల వసూలు వేగవంతం కావాలి

జగదాంబ: యూజర్ చార్జీల వసూలు వేగవంతం కావాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన జోన్ పరిధిలో ఉన్న 12 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో జోనల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్ చార్జీలు వసూలు చేయాల్సిన బాధ్యత పారిశుధ్య సిబ్బంది, సెక్రటరీలదే అన్నారు. అలాగే ట్రేడ్‌లైసెన్సులు లేని వారిని గుర్తించి లైసెన్సులు ఇవ్వాలన్నారు. తీసుకోని వ్యాపారులపై చర్యలు తప్పవన్నారు. వసూల్ చేసిన మొత్తం ఎవరి వద్ద ఉంచకుండా సౌకర్యం సెంటర్‌లో చెల్లించి రసీదు తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు

సీతమ్మధార : ఈనెల 9న నివాస హక్కుల పోరాట దినంపై దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ సదస్సులో కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేయనున్నారని తెలిపారు. రైతాంగ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఆశిష్ మిట్టల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని అన్నారు. యూసీడీ డిపార్ట్‌మెంట్ కేటాయించిన 40 శాతం నిధులను మురికివాడల అభివృద్ధి, ఉపాధికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్ ఈసర లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, అప్పారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మి తదితరులు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం కల్పించాలి


కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో రాకేష్‌రెడ్డి తదితరులు

దాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి ప్రతి కార్యకర్త ఐక్యతతో ముందుకు రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విశాఖ దక్షిణ, తూర్పు నియోజకవర్గాలకు సంబంధించి ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఆ సమస్య పరిష్కారమైతే స్థానికంగా మీరు పట్టు సాధించిన వారవుతారని సూచించారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ, తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.